బీసీలు సీట్లిచ్చే స్థాయికి ఎదగాలి

రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి • బీసీలను ఎదగకుండా చేసిన ఆధిపత్య కులాలు • శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

ఖైరతాబాద్, డిసెంబర్ 29: తమిళనాడు తరహాలో తెలంగాణలో కూడా బీసీ నాయకత్వం సీట్లు అడిగే స్థాయి నుంచి సీట్లిచ్చే స్థాయికి ఎదగాలని మాజీ స్పీకర్, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆకాంక్షించారు. బీసీలు గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. బుడబుక్కల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విఠల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడారు. దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న బీసీలు అన్నిరంగాల్లో అగ్రభాగాన నిలవాలని ఆకాంక్షించారు. నాటి స్వాతంత్ర్య ఉద్యమంతోపాటు వివిధ సామాజిక పోరాటాల్లో పాల్గొన్నది బీసీ లేనని, కానీ, స్వాతంత్ర్యానంతరం నుంచి ఆధిపత్య కులాలే రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నాయని తెలిపారు. ఆ కులాలే బీసీలను చట్టసభల్లోకి వెళ్లకుండా, ఆర్థికంగా ఎదగకుండా చేశాయని ధ్వజమెత్తారు. ఏడు దశాబ్దాల్లో ఇప్పటివరకు పార్లమెంట్‌లో సుమారు 9 వేల మంది ఎంపీలు అయ్యారని, వారిలో స్వల్పంగానే బీసీలకు చోటు దక్కిందని తెలిపారు. రాష్ట్రంలో 119 అసెంబ్లీ స్థానాల్లోనూ జనాభా దామాషా ప్రకారం వాటా దక్కడం లేదని, కొన్ని కులాలైతే చట్టసభ ముఖమే చూడలేదని చెప్పారు. సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, యువజన విభాగం అధ్యక్షుడు పీ సతీశ్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్‌సాగర్, ఆశబూడపు దేవేందర్, ఉమా, చంద్రశేఖర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, మాధవ్, నల్లతీగల రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి

సంచార జాతుల సంక్షేమానికి కృషి

తాను స్పీకర్‌గా ఉన్నప్పుడు కనీసం జిల్లా సరిహద్దులు దాటని కులాల వారిని హైదరాబాద్ నగరానికి తీసుకొచ్చి అసెంబ్లీ, తదితర ప్రాంతాలను చూపించానని మధుసూదనాచారి గుర్తుచేశారు. స్పీకర్‌గా తన నియోజకవర్గానికి రూ.3 వేల కోట్ల అభివృద్ధి నిధులు తీసుకొచ్చానని, గుర్తింపులేని సంచార జాతుల సంక్షేమానికి పాటుపడ్డానని, కోతులోళ్ల సామాజిక వర్గానికి ఓ కాలనీనే ఏర్పాటు చేశానని వివరించారు.

సైన్స్ కోర్సుల్లో క్రెడిట్లకు కోత!

- 160 నుంచి 146కు తగ్గించే యోచన
- ఇదే విషయంపై ఉన్నత విద్యామండలి చర్చలు
- అన్ని వర్సిటీలకు కామన్ క్రెడిట్ విధానం

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ సైన్స్ కోర్సుల క్రెడిట్లకు ఉన్నత విద్యా మండలి కోతపెట్టనుంది. ఇప్పటి వరకు సైన్స్ కోర్సుల్లో 160 క్రెడిట్లు ఉండగా వీటిని 146కు పరిమితం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇదే అంశంపై సబ్జెక్టు నిపుణులు, పలు వర్సిటీల సైన్స్ విభాగాల బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) చైర్మన్లతో త్వరలోనే సంప్రదింపులు జరపనుంది. దీంతో లైఫ్ సైన్సెస్ సహా ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సైన్స్ కోర్సుల్లో క్రెడిట్ల సంఖ్య తగ్గనుంది. దీంతోపాటు ప్రాక్టికల్‌ను రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రాక్టికల్ స్థానంలో ప్రాజెక్ట్ వర్క్‌ను అంతర్భాగం చేస్తారు. డిగ్రీ థర్డ్ ఇయర్‌లో నాలుగు థియరీ, నాలుగు ప్రాక్టికల్స్ పేపర్లుండగా, ఒక ప్రాక్టికల్‌కు బదులుగా ప్రాజెక్ట్ వర్క్‌ను చేర్చాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను వర్కింగ్‌డే లేదా సెలవుల్లో పూర్తిచేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వర్సిటీల్లో క్రెడిట్స్ విధానం ఒకే తరహాలో లేదు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అన్ని వర్సిటీల్లో కామన్ క్రెడిట్ విధానాన్ని అమలుచేయనున్నారు.

ఎంపీహెచ్ఏ పరీక్షకు 84.89% హాజరు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మహిళ) పరీక్షకు 84.89 శాతం మంది హాజరయ్యారు. 24, 268 మంది దరఖాస్తు చేసుకోగా ఆదివారం సీబీటీ విధానంలో నిర్వహించిన పరీక్షకు 29,600 మంది అభ్యర్థులు హాజరైనట్టు ఎమ్‌హెచ్ఎస్ఆర్‌బీ ప్రకటించింది.

'ఫీజు' బకాయిల వివరాలివ్వండి

హైదరాబాద్, డిసెంబర్29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్, నర్సింగ్, ఇతర కళాశాలలు 2017-18 నుంచి 2024-25 సంవత్సరం వరకు పెండింగ్ ఉన్న ఉపకార వేతనాల దరఖాస్తు ఫారాల హార్డ్ కాపీలను అందజేయాలని బీసీ సంక్షేమ శాఖ ఆదేశించింది. ఆదివారం ప్రకటన విడుదల చేసింది. జనవరి 20లోగా జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపింది. ఈ-పాస్ వెబ్‌సైట్‌లో చాలా అప్లికేషన్లలో నో ఫీజు అని చూపుతున్నదని, కళాశాల యాజమాన్యాలు సోషల్‌వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ పీఎంయూ సెంటర్‌ను సంప్రదించి ఫీ స్ట్రక్చర్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించింది. స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజు రాకపోతే పూర్తి బాధ్యత కళాశాల యాజమాన్యాలదేనని, వారిపై శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేస్తామని బీసీశాఖ వెల్లడించింది.

డిగ్రీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్‌ను రూపొందించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా దీనిని అందుబాటులోకి తీసుకురానుంది. సబ్జెక్టుకు చెందిన ముఖ్యాంశాలు గ్రహించేలా, పరీక్షలకు సన్నద్ధం చేయడానికి స్టడీ మెటీరియల్ తోడ్పడుతుందని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. లోతైన అధ్యయనం చేసే వారి కోసం రెఫరెన్స్ పుస్తకాల వివరాలను సైతం పొందుపరుస్తామని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సుల సిలబస్‌ను 30శాతం చొప్పున మార్చాలని ఇప్పటికే మండలి నిర్ణయించింది. ఇందుకోసం కొత్త సిలబస్‌ను రూపొందిస్తున్నది.

18 నుంచి మహా కుంభమేళాకు రైళ్లు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : జనవరిలో నిర్వహించే మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో పలు ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేసినట్టు అధికారులు తెలిపారు. తిరుపతి-బనారస్ మధ్య 4, బనారస్-విజయవాడ 4, సర్సాపూర్-బనారస్ మధ్య 4 ప్రత్యేక రైళ్లను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. వీటిని జనవరి 18 నుంచి ఫిబ్రవరి 24 వరకు షెడ్యూల్ వారీగా నడపనున్నట్టు తెలిపారు.

మోదీ.. బీసీలకు అన్యాయం చేసిండు

- ఈబీసీ రిజర్వేషన్లతో మా గొంతు కోసిండు
- బీసీ జనసభ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నేత రాజారామ్ యాదవ్

కలెక్టరేట్, డిసెంబర్ 29: ఆర్థికంగా వెనుకబడిన వారంటూ, అగ్రకులాలకు రిజర్వేషన్లు కల్పించి ప్రధాని మోదీ దేశంలోని బీసీల గొంతు కోశారని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నేత రాజారామ్ యాదవ్ ఆరోపించారు. సమాజంలో సింహభాగం ఉన్న వెనుకబడిన తరగతుల స్థితిగతులను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకునేందుకు బీసీలంతా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని కృషి భవన్‌లో బీసీ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కుల, మతాల పేరుతో రిజర్వేషన్లు కల్పిస్తున్న పాలకులు, సమాజంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే బీసీలు అగ్రకుల రాజకీయ నేతల ఆగ్రహానికి బలవుతున్నారని దుయ్యబట్టారు. దేశ సంపద సృష్టిలో వృత్తి కులాల పాత్ర ఇతోధికమని తెలిసినా, ఆ కులాలను అణచివేస్తున్న ఘనత కాంగ్రెస్, బీజేపీకే దక్కుతుందని ఆరోపించారు. కమ్యూనిస్టులను కూడా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ జీవో 29ని తెచ్చి బీసీల భవిష్యత్తును సర్వనాశనం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ ఆధిపత్య కులనాయకుల జెండాలు మోసిన బీసీలు ప్రస్తుతం ప్రశ్నించే స్థాయికి ఎదగటం హర్షించదగ్గ పరిణామమన్నారు.

అభివాదం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, డాక్టర్ అరుణ్‌కుమార్, గుజ్జ సత్యం, అంజి, రామకృష్ణ, తదితరులు

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

- స్థానిక ఎన్నికల్లోగా 42 శాతం పెంచాల్సిందే
- ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్ కృష్ణయ్య హెచ్చరిక

కాచిగూడ, డిసెంబర్ 29: బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుండా తెలంగాణ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే యుద్ధం జరిగి తీరుతుందని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని అభినందన్ హోటల్‌లో సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించారని, ఎన్నికల సభల్లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి హామీలు గుప్పించారని తెలిపారు. తీరా పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. తక్షణమే రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ నేతలు డాక్టర్ ఆర్ అరుణ్‌కుమార్, గుజ్జ సత్యం, అంజి, జీ మల్లేశ్, అనంతయ్య, వేముల రామకృష్ణ, రాజేందర్, ఉదయ్‌నేత, రమాదేవి, మోదీ రామ్‌దేవ్, వీరన్న, జయంతిగౌడ్, రఘుపతి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఫిబ్రవరి 1 వరకు తుది గడువు

హైదరాబాద్, డిసెంబర్29 (నమస్తే తెలంగాణ): సాంఘిక, గిరిజన, బీసీ, సాధారణ సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో 5వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సొసైటీ అధికారులు ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 ఫీజు చెల్లించి ఫిబ్రవరి 1 లోగా దరఖాస్తులు సమర్పించాలని వెల్లడించారు. వివరాలకు www. tgcet. cgg.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 040-233915 98, 9491063511, 040-233 28266, 24734899 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వెలమ విద్యార్థులకు 'విద్యా దాన నిధి' చెక్కులను అందజేస్తున్న ప్రతినిధులు

పేదలకు 'విద్యా దాన నిధి' స్కాలర్‌షిప్పులు

537 మంది వెలమ విద్యార్థులకు అందజేత

హైదరాబాద్, డిసెంబర్29 (నమస్తే తెలంగాణ): పేద వెలమ విద్యార్థులకు 2024 విద్యా సంవత్సరానికిగానూ 'విద్యా దాన నిధి' పథకం ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేసినట్టు 'విద్యా దాన నిధి' సబ్ కమిటీ చైర్మన్ అయిల్నేని రవీందర్‌రావు, కన్వీనర్ పోల్సాని రవీందర్‌రావు తెలిపారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఇండియా వెలమ అసోసియేషన్ భవన్‌లో 537 మంది విద్యార్థులకు రూ.97లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఐవా అధ్యక్షుడు కృష్ణమనేని పాపారావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నీలగిరి దివాకర్‌రావు, తాండ్ర శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు గోన శ్రీలత, ప్రధాన కార్యదర్శి కోట్ల వీణ, కోశాధికారి హరీశ్ చెప్యాల, కార్యవర్గ సభ్యులు కోట్ల నరేందర్‌రావు, ఉజ్జిని కిషన్‌రావు, చిట్నేని సంజీవరావు, చెన్నమనేని రామ్మోహన్‌రావు, అల్లాడి రాజేందర్‌రావు, గొట్టిముక్కల భాస్కరరావు, జీ కే ప్రవీణ్‌రావు, మహిళా కార్యవర్గ సభ్యురాళ్లు బొంత గోమతి, పడకంటి షర్మిల, ఐవా మాజీ ఉపాధ్యక్షులు సంకినేని జగన్మోహన్‌రావు, వేముల శ్రీకాంత్‌రావు, తానిపర్తి వేణుగోపాల్‌రావు, కల్వకుంట్ల ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ టీచర్లుగా గుర్తించండి

- కనీస వేతనం అమలు చేయండి
- ప్రభుత్వానికి అంగన్‌వాడీ టీచర్ల సంఘం వినతి
- పట్టించుకోని రేవంత్‌రెడ్డి సర్కారు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లను ప్రీ ప్రైమరీ టీచర్లుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలుచేయాలని అంగన్‌వాడీ టీచర్ల సంఘం ప్రభుత్వాన్ని కోరుతున్నది. తమకు గ్రాట్యుటీ విధానం అమలుతోపాటు ఆరోగ్య కార్డులు జారీచేయాలని డిమాండ్ చేస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వానికి ఆ సంఘం నాయకులు పలుసార్లు వినతిపత్రాలు అందచేశారు. సర్కారు స్కూళ్ల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను అదే స్కూళ్లలో ఏర్పాటుచేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో బోధనకు అవకాశం కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు, డైరెక్టర్ కాంతి వెస్లీకి విల్లింగ్ లెటర్లు అందచేసినట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకురాలు నిర్మల తెలిపారు. అయినా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1500 పైగా అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేశారు. వాటిని మోడల్ అంగన్‌వాడీలుగా మార్చి కొంతమంది అంగన్‌వాడీ టీచర్లకు పాఠాలు బోధించే అవకాశం కల్పించారు. మిగిలిన వారికి కూడా పీఎంశ్రీ పథకం కింద ఏర్పాటవుతున్న ప్రీ ప్రైమరీ క్లాసులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీల్లో 35,700 మంది టీచర్లు పని చేస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటనకు వెనుకాడబోమని ఆ సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

చంపుతామని బెదిరిస్తున్నరు!

అల్లు అర్జున్ ఇంటిపై దాడి కేసు నిందితుల వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేసినందుకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే చంపేస్తామని అల్లు ఆర్మీ, అల్లు అర్జున్ ఫ్యాన్స్ పేరుతో కొందరు బెదిరిస్తున్నారని అర్జున్ ఇంటిపై దాడి కేసులో నిందితులు తెలిపారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫోన్ చేసి బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వారు మాట్లాడుతూ.. తమను బెదిరిస్తూ వందల కాల్స్ వస్తున్నాయని వాపోయారు. తమ నంబర్లను సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారని చెప్పారు. ఫోన్ కాల్స్ ఆగకపోతే వేలాది మంది విద్యార్థులతో కలిసి అల్లు అర్జున్ ఇంటిని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

బడులకు ఉచిత విద్యుత్తు ఉత్తదేనా!

- సర్కారు విద్యాసంస్థలకు అమలవని పథకం
- నాలుగు నెలలుగా జారీకాని జీరో బిల్లులు
- నెల నెలా బిల్లులు జారీచేస్తున్న విద్యుత్తుశాఖ
- పాత బకాయిలు రూ.100 కోట్లకు పైగా పెండింగ్

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): హామీలు కొండత.. అమలు గోరంత అన్న చందంగా మారింది రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల పరిస్థితి. విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తు పథకం అందులో ఓ భాగం. అట్టహాసంగా ప్రకటించిన బడులకు ఉచిత విద్యుత్తు పథకం ఆఖరుకు ఉత్తదే అయ్యింది. పథకం ప్రకటించి నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు జీరో బిల్లులు జారీకావడంలేదు. రాష్ట్రంలోని 32వేల విద్యాసంస్థలకు ఇప్పటికీ వినియోగమైన విద్యుత్తుకు బిల్లులు జారీ అవుతున్నాయి. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్లలోపు వినియోగమున్న గృహాలకు జీరో బిల్లులు జారీచేస్తున్నారు. కానీ విద్యాసంస్థలకు మాత్రం జీరో బిల్లులివ్వడం మరిచారు. దీంతో పాఠశాలల హెడ్‌మాస్టర్లకు టెన్షన్ పట్టుకున్నది. ఇదేం స్కీమ్ అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అమలు జాడేది..?

రాష్ట్రంలోని సర్కారు విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తునిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ ఏడాది సెప్టెంబర్ 5న ప్రకటించారు. అదేరోజు ప్రభుత్వం జీవో -20ని జారీ చేస్తూ.. సర్కారు విద్యాసంస్థలకు చెందిన విద్యుత్తు బిల్లులను ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని 27,862 విద్యాసంస్థలకు ఈ ఉచిత విద్యుత్తు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన గురుపూజోత్సవంలో జీవో -20ని ప్రదర్శించారు. ఇదే మా చిత్తశుద్ధి అంటూ గొప్పలు చెప్పుకున్నారు. కానీ, నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు ఈ స్కీం అమలుకు నోచుకోలేదు. విద్యాసంస్థలకు జీరో బిల్లులు జారీకాలేదు. దీంతో ఇంతకు ఈ స్కీమ్ ఉన్నట్టా.. లేనట్టా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

వందకోట్లకు పైగా బకాయిలు..

రాష్ట్రంలోని సర్కారు బడులకు సంబంధించిన విద్యుత్తు బిల్లులు రూ.100 కోట్లకు పైగా బకాయిలున్నాయి. ఈ బకాయిలను సైతం మాఫీ చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. మూడు నెలలు గడిచినా ఇంతవరకు వీటిపై ప్రభుత్వం తేల్చలేదు. అటు బకాయిలు మాఫీ కాకపోగా, ఇటు జీరో బిల్లులు జారీకాకపోవడం గమనార్హం. అయితే రాష్ట్రంలో 31వేల విద్యాసంస్థలున్నాయి. కానీ ప్రకటన సమయంలో కేవలం 27,862 విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తునిస్తామని తెలిపారు. అంటే ఉచిత విద్యుత్తును కొన్నింటికిచ్చి, మరికొన్నింటికి ఇవ్వరా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఉదాహరణలివిగో..

- కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని ఓ జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రతి నెల రూ. 2వేల బిల్లును విద్యుత్తుశాఖ సిబ్బంది జారీ చేస్తున్నారు.
- జగిత్యాల జిల్లా మల్యాలలోని ఓ గురుకుల పాఠశాలకు ఈ నెల 12న బిల్లును జారీచేశారు. ఈ పాఠశాలకు రూ. 1,209 బిల్లును ఇచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.13,527 బిల్లు పెండింగ్‌లో ఉంది.
- కోరుట్ల నియోజకవర్గంలోని మరో గురుకుల పాఠశాలకు ఈ నెల 4న బిల్లును జారీచేశారు. 46 యూనిట్ల విద్యుత్తు వినియోగించగా రూ. 162 బిల్లు జారీచేశారు. పాత బిల్లు రూ. 244 బకాయి ఉండగా, మొత్తం రూ. 406 చెల్లించాలని కొత్త బిల్లు జారీచేశారు.
- జగిత్యాల చల్‌గల్ సెక్షన్‌లోని ఓ జిల్లా పరిషత్ పాఠశాలలో 100 యూనిట్ల విద్యుత్తు వినియోగమయ్యింది. రూ.1,089 బిల్లు కాగా, పాత బిల్లు 15వేలు కలుపుకుని మొత్తం రూ.16,932 చెల్లించాలని కొత్త బిల్లును జారీచేశారు.

'హెల్త్ కేర్' వారికి ఉద్యోగాలు కల్పించండి

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు చదివిన వారికి ప్రభుత్వ దవాఖానలు, మెడికల్ కాలేజీల్లో ఉద్యోగావకాశాలు కల్పించాలని హెల్త్ కేర్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో అసోసియేషన్ సభ్యులు మంత్రికి వినతి పత్రం అందించారు. తమ అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించారని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

- ప్రకృతి సంరక్షకులకు ధన్యవాదాలు

ప్రకృతి సంరక్షణకు తన ప్రయాణంలో భాగమైన వారందరికీ రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. 'ఫ్లైట్ డౌన్ మెమొరీస్‌తో ఈ సంవత్సరాన్ని ముగించండి' అంటూ ఎక్స్ వేదికగా 2024లో తాను తీసిన కొన్ని పక్షులకు సంబంధించిన వీడియోను ఆదివారం షేర్ చేశారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. – హైదరాబాద్

'గోర్ బోలి'ని లంబాడీ భాషగా గుర్తించాలి

- సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ర్యాలీ తీస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): లంబాడీల భాష 'గోర్ బోలి'ని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చి, అధికారికంగా ప్రకటించాలని లంబాడీల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆదివారం లంబాడీల గర్జన సభ నిర్వహించారు. రాంబల్ నాయక్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ లంబాడీలను నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మిట్టు నాయక్, దసరం నాయక్, ప్రధాన కార్యదర్శి చంద్రనాయక్, రాజునాయక్, లక్ష్మణ్‌నాయక్, చందునాయక్, మోహన్‌సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- రేవంత్ మాస్కులు ధరించిన వారికి రాఖీలు కట్టి..

'సీఎం రేవంత్ అన్నా.. మేము మీ చెల్లెళ్లుగా భావించి మా సమస్యలు పరిష్కరించు' అంటూ మంచిర్యాల జిల్లా నస్పూర్ కలెక్టరేట్ వద్ద సీఎం ఫొటోతో కూడిన మాస్కులు ధరించిన ఉద్యోగులకు రాఖీలు కట్టి మహిళా ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. – నస్పూర్

- 'ఖిల్లా'లో వెయ్యేండ్లనాటి గణపతి

వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం శివారులోని పొలాల్లో ఉన్న వెయ్యేండ్ల సిద్ధి గణపతి విగ్రహాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన ఖిల్లా శివారులో పెద్ద గుండుపై ఐదు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు ఉన్న గణపతి విగ్రహాన్ని పరిశీలించారు. క్రీ.శ. 11వ శతాబ్దం కందూరు చోళుల తొలి కాలపు ప్రతిమను తెలియజేస్తున్నదని పేర్కొన్నారు. – ఖిల్లాఘణపురం

ఎస్సీ వర్గీకరణతో రిజర్వేషన్లు పోతయ్

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

ఎదులాపురం, డిసెంబర్ 29 : ఎస్సీ కులాలను విభజిస్తే రిజర్వేషన్లు పోయే ప్రమాదం ఉన్నదని, ఈ విషయాన్ని అప్పుడే రాజ్యాంగం ద్వారా అంబేద్కర్ చెప్పినట్టు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో మాల సంక్షేమ భవనం వద్ద మాల భవిష్యత్ కార్యాచరణ, జిల్లా స్థాయి విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. మాలలు త